
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 4 జనవరి 2025

జిల్లాలో ప్రభుత్వ ధాన్యంతో వ్యాపారం సాగిస్తున్న మిల్లర్లు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం తిరిగి ఇచ్చే విషయంలో ఇంకా జాప్యం కొనసాగుతూనే ఉంది. సకాలంలో ధాన్యానికి బియ్యం అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ నోటీసులు ఇస్తున్నప్పటికీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాయి. కొన్ని మిల్లులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని, తాము ఇప్పట్లో బియ్యం అందించలేమని ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ సొమ్ము రైస్‌మిల్లర్ల పాలు అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది.



సొమ్ము సర్కారుది..
సోకు మిల్లర్లది..

- సీఎంఆర్ ధాన్యంతో మిల్లర్ల వ్యాపారం
- ధర పెరిగినప్పుడు అక్రమంగా అమ్మకం
- 'కస్టమ్ మిల్లింగ్ రైస్' ఇవ్వకుండా జాప్యం
- కోర్టు ఉత్తర్వులతో ఆస్తులు జప్తు కాకుండా జాగ్రత్తలు
- ఉద్దేశపూర్వకంగానే మిల్లర్ల కాలయాపన
- పెండింగ్‌లో రూ.100కోట్ల విలువైన 4,698 మెట్రిక్ టన్నుల బియ్యం
- సంక్రాంతితో ముగియనున్న 'వానాకాలం' కొనుగోళ్ల సీజన్

ఖమ్మం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ప్రతీ సంవత్సరం ఖరీఫ్, రబీలో సుమారు 3 నుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ సేకరిస్తుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలద్వారా సేకరించిన ధాన్యాన్ని కనీసం ఆరునెలల్లోగా బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని సీఎంఆర్ కింద తీసుకుని, ఆ ధా న్యాన్ని అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మధ్యలో ధరలు పెరిగినప్పుడు బియ్యంగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ కోటాలో బియ్యాన్ని అప్పగించే విషయంలో గడువు పెంచుకుంటూ కాలయాపన చేస్తున్నారు. మళ్లీ ధాన్యం సేకరణ సమయంలో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి బియ్యం అందించడం, రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి సీఎంఆర్‌కు తరలించడం ద్వారా రైస్‌మిల్లర్లు పెద్దవ్యాపార దందా నడిపిస్తున్నారు.

కోర్టు ఉత్తర్వులతో రికవరీకి జాప్యం..

జిల్లాలో సుమారు 60పైగా రైస్‌మిల్లులుండగా 17 రైస్‌మిల్లుల నుంచి 2023-24 ఖరీఫ్ కింద సీఎంఆర్ ధాన్యం 4,698 మెట్రిక్ టన్నులకు సంబంధించిన బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. వీటికి నోటీసులు ఇస్తున్నా.. అదుగో.. ఇదిగో ఇస్తామంటూ జాప్యం సాగిస్తున్నా యి. ఉద్దేశపూర్వకంగానే ధాన్యం పెండింగ్‌లో ఉంచి వ్యాపారం నడిపిస్తున్నాయి. ఇవి కాకుండా ఇటీవల సివిల్ సప్లయీస్ అధికారుల దాడుల్లో లభ్యమైన సుమారు రూ.100కోట్ల విలువైన ధాన్యం మూడు రైస్ మిల్లులనుంచి రికవరీ కావాల్సి ఉంది. ఈమూడు రైస్‌మిల్లులు కోర్టుకు వెళ్లడంతో సివిల్ సప్లయీస్ అధికారులు రికవరీ చేయలేని పరిస్థితి నెలకొంది. సివిల్ సప్లయీస్ శాఖ చట్టాలను అడ్డుపెట్టుకుని మిల్లర్లు దందాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ యాక్టు ఉన్నా కోర్టు స్టేలతో ఆస్తులు జప్తుకాకుండా కాపాడుకుంటున్నారు. మిల్లర్ల జాప్యం చేస్తుండటంతో దారితప్పిన ధాన్యం రికవరి కావడం లేదు.

సంక్రాంతికి కొనుగోళ్ల ముగింపు

జిల్లాలో ఈఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరాయి. 344 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ.515కోట్ల విలువైన 2లక్షల 22వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. తద్వారా జిల్లాలో 30,904మంది రైతులకు రూ.90 కోట్ల55లక్షలు బోనస్‌గా చేరింది. జిల్లాలో మరో 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సంక్రాంతిలోగా సేకరించే అవకాశం ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పోటీగా ధాన్యం కొనుగోళ్ల వల్ల లక్ష్యానికి అనుగుణంగాఆ సేకరణ జరగలేదు అయితే బోనస్ రూ.500 ఉన్నందున ప్రైవేటులో కూడా అదేస్థాయిలో ధర పెంచి ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తంమీద బోనస్ ఈసారి ధాన్యం రైతులకు కొత్త ఆదాయం తెచ్చిపెట్టింది.

విధి నిర్వహణలో చిత్తశుద్ధి చూపాలి...

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్
- గంగారం పోలీసు బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్



ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డు ప్రదానం చేస్తున్న సీపీ

సత్తుపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చూపే ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి, నిబద్ధత మొత్తం పోలీస్ వ్యవస్థకే వన్నె తెస్తాయని ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. మండల పరిధిలోని గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో శిక్షణ ముగించుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీ సునీల్‌దత్ పాల్గొని మాట్లాడారు. పోలీసులు తమ పనితీరుతో ప్రజల మన్ననలను పొందాలని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, నిజాయితీగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ ముగించుకున్న సిబ్బంది పాసింగ్ ఔట్ పెరేడ్ ఘనంగా నిర్వహించారు. శిక్షణకాలంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శిక్షణార్థులకు, ట్రైనింగ్ స్టాఫ్‌కు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ, బెటాలియన్ కమాండెంట్ పీజెపీసీ చటర్జీ గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అడిషనల్ కమిషనర్ విజయబాబు, సత్తుపల్లి ఏసీపీ రఘు, ఐబీ అసిస్టెంట్ డైరక్టర్ దామోదర్‌రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాడెంట్స్ శ్రీధర్ రాజా, ఎస్‌డీ రంగారెడ్డి, పీఆర్‌ఓ కె.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, శిక్షణ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, బంధు వులు పెద్దసంఖ్యలో రావడంతో బెటాలియన్ గ్రౌండ్ వద్ద కోలాహలం ఏర్పడింది.



నరసింహుడైన.. భద్రాద్రి రామయ్య

- స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు
- నేడు వామనావతారం

6



పచ్చతోరణం

గ్రీన్‌సిటీగా మారుస్తాం

బెల్లం రాధిక, కేఎంసీ ఉద్యాన అధికారి

ప్రశ్న: ఖమ్మం నగరంలో మొక్కల పెంపకం ఎలా ఉంది..?

జవాబు: ఖమ్మం నగరంలో 39పార్కులు, ఆరు డివైడర్లు, డంపింగ్‌యార్డు, 6 వాక్ వేలు, ఖానాపురం ట్యాంక్ బండ్, లకారం ట్యాంక్ బండ్, వాకర్స్ ప్యారడైజ్‌తోపాటుగా ఇంటింటికి కేఎంసీ ద్వారా మొక్కల పంపిణీ జరుగు తోంది. రహదారుల మొక్కలు పెంపకం, 41 పల్లే ప్రకృతివనాల ద్వారా మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. మొక్కలు ఎండిపోకుండా వాటికి కావాల్సిన కంపోస్టు, నీరు ఏర్పాటు చేశాం.

ప్ర: ఔషధ మొక్కలపెంపకం ఎలా ఉంది..?

జ: పర్యావరణానికి హాని కలిగించే మొక్క లు, వృక్షాలను తొలగించాం. ఖమ్మం నగరంలో జయశంకర్ పార్కులో ఔషధ మొక్కల ప్లాంట్స్ ఏర్పాటు చేయటం జరిగింది. వాకర్స్ తో పాటుగా పార్కుకు వచ్చే వారు సైతం ఔషధ మొక్కల గురించి అవగాహన పెంచుకుంటున్నారు. దశల వారీగా అన్ని పార్కుల్లో ఔషధ మొక్కల పెంపకానికి కార్యాచరణ చేస్తున్నాం..


ప్ర: నగరంలో డివైడర్లు నిర్వహణ ఎలా ఉంది..?

జ: ఖమ్మం నగరంలో ప్రధానంగా ఆరు డివైడర్లలో మొక్కలు పెంచుతున్నాం. ప్రతి వారం గ్యాప్ ఫిల్లింగ్ చేస్తున్నాం. గతంలో కంటే ఆహ్లాదకరంగా ఉండే ఆకర్షనీయమైన మొక్కలను నాటుతున్నాం. డివైడర్ల వారీగా సిబ్బందిని కేటాయించి ప్రతి రోజు పర్యవేక్షణ పెంచాం.

ప్ర: 2025లో మొక్కల పెంపకం లక్ష్యం..?

జ: 2025లో ఖమ్మం నగరంలో 4 లక్షల మొక్కలను నాటి వాటిని సంరక్షణ చేసేందు కు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య సూచనల మేరకు కార్యాచరణ పూర్తి జరిగింది. ఖాళీ ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదా రుల వెంట మొక్కలను నాటేందుకు పరిశీలన చేశాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం



సమీక్షలో మంత్రి, ఎంపీ, కలెక్టర్

వడివడిగా 'మున్నేరు' పనులు


- వచ్చే వానాకాలం లోగా వరద నివారణ పనులు పూర్తి కావాలి
- మున్నేరు బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలి
- భూ సేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టండి
- సంక్రాంతిలోగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వచ్చే వానాకాలం నాటికి మున్నేరు వరద నివారణ పనులు పూర్తిచేసి వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జూలై 15 నాటికి పనులు పూర్తిచేయాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

6

మరో నాలుగు కొత్త పీహెచ్‌సీలు

- కొత్తగా గోకినేపల్లి సబ్‌సెంటర్ కూడా..
- ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు
- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాకు కొత్తగా నాలుగు పీహెచ్‌సీలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. నేలకొండపల్లి మండలం చెర్వుమాధారం, వైరా మండలం గొల్లపూడి, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు, దెందుకూరులో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వీటితో ప్రతి 30వేల జనాభాకు ప్రాథమిక వైద్యం అందాలన్న లక్ష్యం నెరవేరనుందన్నారు. పీహెచ్‌సీ ఏర్పాటయితే ఆ ప్రాంతంలో వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయవచ్చన్నారు. దీనితో పాటు ముదిగొండ మండలం గోకినేపల్లిలో మరో ఆరోగ్య ఉప కేంద్రాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 26పీహెచ్‌సీలు, మరో నాలుగు (మిగతా 6వ పేజీలో)

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాటేపల్లి జనార్ధన్

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కాటేపల్లి జనార్ధన్‌ను ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు నియమించారు. శుక్రవారం బల్లేపల్లిలోని ఓ రెస్టారెంట్లో ఖమ్మం జిల్లా రియల్ ఎస్టేట్ యూనియన్ ఆధ్వర్యంలో కాటేపల్లి జనార్ధన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో ఏజెంట్లకు అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కాటేపల్లి జనార్ధన్ మాట్లాడుతూ సంఘానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దిరాజు, కార్యదర్శులు కోట వెంకటరెడ్డి, అన్నం వీర ప్రసాద్, జిల్లా నాయకులు బుర్ర సురేష్ బాబు,వేస్కు అన్వర్ పాషా, కే కైలాష్, పఠాన్ జానీ, జల్లి శ్యాము, పామర్తి నాగేశ్వరరావు, మదర్, ప్రసాద్ రెడ్డి, కన్నారావు, దేవుళ్ళ వెంకట్, పాశం నరేష్, నున్న కృష్ణప్రియ, వెంకటకృష్ణ ఆంజనేయులు పాల్గొన్నారు.

10నుంచి అవుట్‌డోర్ బ్యాడ్మింటన్ టోర్నీ

భద్రాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని భగవాన్‌దాస్ కాలనీలో ఈ నెల 10 నుంచి 12 వరకు అవుట్‌డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు కుంజా సంతోష్ తెలిపారు. 12న స్వామి వివేకానంద జయంతిని నేషనల్ యూత్ డేను పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, విజేతలకు రూ.10 వేలు షీల్డు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.4 వేలు షీల్డు అందజేయనున్నట్టు తెలిపారు.

రేపటినుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

జూలూరుపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి జూలూరుపాడులో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాయల సిద్ధు, వంశీ, నరేష్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు రెడ్ టెన్నీస్ బాల్‌తో నిర్వహించడం జరుగుతుందని, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. తమ ఎంట్రీలను 9912848427, 9666123550, 9502139274 నెంబర్లకు పంపించాలని వారు తెలిపారు.

గోదావరి చెంతన ప్రకృతి అందాలు

- క్యాంపింగ్ లివింగ్ రూముల ఏర్పాటు
- పూర్తిగా కర్రలతో ఫెన్సింగ్ ప్రహరీ
- పాత్‌వేకు ఇరువైపులా సోలార్‌తో విద్యుత్తు దీపాల ఏర్పాటు
- భద్రాద్రిలో తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు
- ఏరు పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

పర్యాటకులకు కనులవిందు చేసేందుకు రంగం సిద్ధం



ఏరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

భద్రాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ తీరాన గతంలో ఎన్నడూలేని రీతిలో పర్యాటకులకు కనులవిందు చేసేందుకు రంగం సిద్ధమైంది. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవతో జిల్లా పర్యాటక రంగానికి నూతన సొబగులు దిద్దేందుకు చేపడుతున్న చర్యలు తుదిదశకు చేరుకున్నాయి. రాబోయే మూడు నెలల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా పూర్తి ప్రకృతి అందాలకు ప్రాధాన్యమిస్తూ గ్రామీణ వాతావరణ పరిమళాలు వెదజల్లుతూ ఏర్పాట్లు సాగుతున్నాయి. భద్రాచలంలోని గోదావరి నది చెంత క్యాంపింగ్ లివింగ్ రూములు ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు, నలుగురు లేదా ఒక కుటుంబం గోదావరి ఒడ్డున సేద తీరేలా ఈ ఏర్పాట్లు సాగుతున్నాయి. నేలపై వెదురు తడికలతో క్యాంపింగ్ లివింగ్ రూములు ఏర్పాటు చేసి అందులో పరుపులను వేయనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా సెల్ఫీ పాయింట్‌ను సైతం వెదురు బొంగులతో ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటకులకు షడ్రుచులతో అందించే పసందైన విందు భోజనశాలను పూర్తిగా కర్రల, వెదురు తడికలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. అదేవిధంగా పర్యాటకులకు మరుగుదొడ్లు, స్నానపు గదులను సైతం చెక్కలు, రేకులతో ఏర్పాటుచేస్తున్నారు.

పాత్‌వేకు సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటు

భద్రాచలంలోని పర్యాటకుల విడిదిలో సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. పాత్‌వేకు ఇరువైపులా 24వాట్స్‌తో ఉండే 16 దీపాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన సామగ్రి ఇప్పటికే భద్రాచలం చేరుకుంది. ఇందుకు సంబంధించిన పనులు శనివారం పూర్తి కానున్నాయి. ఇదిలా ఉండగా క్యాంపింగ్ లివింగ్ రూముల చుట్టూ ప్రహరీ మాదిరిగా కర్రలతో ఫెన్సింగ్‌ను ఏర్పాటు, నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లా పర్యాటకం సాగేది ఇలా...

వివిధ ప్రాంతాలనుంచి వచ్చే పర్యాటకులు ముందుగా భద్రాచలం చేరుకుంటారు. ఇక్కడ రామయ్య దర్శనం అనంతరం గిరిజన మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఈ సమయం లో గిరిజన వంటకాలు, అడవుల్లో లభించే వివిధ రకాల పండ్లు రుచి చూడనున్నారు. గోదావరి నదీ తీరాన ఏర్పాటు చేసిన విడిదిలో సేద తీరుతారు. మరుసటి రోజు కిన్నెరసాని బోటింగ్‌కు వెళ్లి అనంతరం దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పను సందర్శించి అక్కడ ఆదివాసీలతో మమేకమై క్యాంపైర్‌లో పాల్గొంటారు. అలాగే గిరిజనుల నృత్యాలు, పాటలతో ఆహ్లాదకరంగా వాతావరణం సాగనుంది. మళ్లీ రాత్రికి భద్రాచలం గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన విడిది(క్యాంపింగ్ లివింగ్ రూములు) వద్దకు చేరుకొని బస చేస్తారు. మళ్లీ మరుసటి రోజు చంద్రుగొండ మండలంలోని బెండాలపాడుకు ట్రెక్కింగ్ కోసం వెళ్తారు. దీంతో పర్యాటక యాత్ర పూర్తికానుంది. భద్రాచలం, కిన్నెరసాని, బొజ్జిగుప్ప, బెండాలపాడులో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

'ఏరు' పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి

జిల్లాలో విస్తృతంగా పర్యాటక కార్యక్రమాలను ప్రారంభించేందుకు రూపొందించిన ఏరు పండుగ ప్లాన్‌కు సంబంధించిన పోస్టర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం కొత్తగూడెంలో ఆవిష్కరించారు. ఈ పేరు గోదావరి నది, ఘాట్ల చుట్టూ నిర్వహించే వేడుకలను ప్రతిబింబించేందుకు ఎంపిక చేశారు.



క్యాంపింగ్ లివింగ్ రూమ్



వెదురు, కర్రలతో ఏర్పాటు చేసిన భోజనశాల

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నర్సరీ, కేజీ క్లాసులు ప్రవేశపెట్టాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని టీయస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు షేక్. రంజాన్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్లో 15శాతం నిధులు కేటాయించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని , జూలై-2023 నుంచి తెలంగాణ రెండో పీఆర్సీని అమలు చేయాలని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ సత్వరమే చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వెంకన్న,రాంబాబు, లివిన్, మహేష్, రాందాస్, నాగేశ్వరరావు, సుధాకర్, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చైనీస్ మాంజా అమ్మొద్దు : సీపీ సునీల్‌దత్



ఖమ్మంక్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ పందేలు అడ్డుకునే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని పోలీసు అధికారులతో కోడిపందేలు నిర్వహించకుండా తీసుకోవాల్సిన చర్యలపై టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కోడిపందేలు నియంత్రించేందుకు డివిజన్, మండల, గ్రామస్థాయిలో టీంలు ఏర్పాటుచేసి నిలువరించేలా పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కమిషనరేట్ పరిధిలో కోడిపందేలు, జూదం వంటివి జరుగుతున్నాయని సమాచారం అందితే వెంటనే అక్కడకు వెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కోడిపందేలు, జూదం నిర్వహణకు హోటల్, భూములు, గెస్ట్‌హౌజ్‌లు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని, బెట్టింగ్, పేకాట స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలని తెలిపారు. కోడిపందేలు నిర్వహించిన వారిని కత్తులు కట్టేవారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేయాలని, కోడిపందేలు నిర్వహణ నిషేధంపై ప్రజలకు అవగాహన కలిపించాలని అన్నారు. అదేవిధంగా చైనీస్ మాంజా వినియోగం, అమ్మకం, నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మానవుల ప్రాణాలకు, పక్షులు, జంతువులకు హానికలిగించే నిషేదిత చైనా మాంజాపై జిల్లాలోని పోలీసు అధికారులందరు దృష్టిసారించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా చైనీస్ మాంజా అమ్ముతున్న దుకాణాలపై కేసులు నమోదు చేయాలని, కొనుగోలు చేసేవారు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటనలపై స్థానిక పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్సు పోలీసులు కూడా దృష్టిసారించాలని ఆదేశాలు జారీచేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

ప్రాజెక్టుల పేరుతో మింగారు..

ఎమ్మెల్సీ కోదండరాం

పాల్వంచ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ పార్టీగా అధికారం చేజిక్కించుకుని ప్రాజెక్టుల పేరుతో అందినకాడికి మింగారని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కొమరం భీం ప్రాంగణంలో టీజేఎస్ జిల్లా ప్లీనరీలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఆర్ఎస్ నియంతృత్వ విధానాల వల్లనే ప్రజలు ఓడించారని అన్నారు. నేటికి ఆత్మవిమర్శ చేసుకోకుండా నిబద్ధతతో పని చేస్తున్న ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని అన్నారు. ప్రజాస్వామిక వాతావరణం ఉన్నందున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినట్టు ఆయన చెప్పారు. నిరుద్యోగుల విషయంలో సానుకూల వాతావరణాన్ని అవలంభిస్తోందని, భద్రాద్రి పవర్‌ప్లాంట్ అవినీతి విషయంలో విచారణ జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. గోదావరి 1వ దశ పూర్తి చేసి ఇల్లెందు ప్రాంతానికి నీరు అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేటీపీఎస్ ఓఅండ్‌ఎం ప్లాంట్‌ను మూసివేసిన తర్వాత అదేస్థానంలో 800మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగరేణిలో పని చేసిన 32వేల మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు. ఉద్యమకారులకు ఇచ్చిన ఆరు హామీలను అమలు పర్చేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వలస గొత్తికోయలకు ఎస్టీ ఆదివాసీ సర్టిఫికెట్లను ఇవ్వాలని చెప్పారు. ఈ ప్లీనరీలో జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి రామనాథం, సిద్ధులు, నబీ, వన్నారం శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు అమూల్యం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్

ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివిన విద్యావంతులు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో తమతో పాటు సమాజ అభివృద్ధిలో పాటుపడాలని, సావిత్రిబాయి పూలే 150 ఏళ్ల క్రితమే వివక్ష ఎక్కువ ఉన్న కాలంలోనే మహిళా విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ , నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, ఇంటర్మిడియట్ అధికారి కె. రవిబాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళా అధ్యాపకులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నరసింహుడైన.. భద్రాద్రి రామయ్య

స్వామి వారిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు



భద్రాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి నృసింహావతారంలో భక్తులకు దర్శనమివ్వగా స్వామి వారిని తిలకించిన భక్తులు పులకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించి నృసింహావతారాన్ని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ, భాజభజంత్రీలు, మహిళ భక్తుల కోలాటాల నడుమ స్వామి వారిని మిథిలా స్టేడియ ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్య క్రమాలు నిర్వహించి స్వామి వారికి నివేదన చేశారు. ఈసమయంలో భక్తులు స్వామి వారిని భక్తి ప్రపత్తులతో తిలకించి తరించారు. అనంతరం స్వామి వారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. నేడు స్వామి వారు వామనావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మరో నాలుగు కొత్త పీహెచ్‌సీలు

(5వ పేజీ తరువాయి)

పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు 161 పల్లెదవాఖానాలు, 9 పట్టణ దవాఖానాలున్నాయన్నారు. పల్లెదవాఖానాల్లో వైద్యసిబ్బందిని భర్తీ చేసి పూర్తిస్థాయిలో అక్కడే వైద్యాన్ని అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా పల్లె దవాఖానాలో 19, పట్టణ దవాఖానాల్లో 3 ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. వీటికి దరఖాస్తులను ఆహ్వానించామని వాటిని త్వరలో భర్తీ చేసి పల్లెల్లోనూ అన్ని రకాల వైద్యసేవలను మరింత పటిష్టం చేస్తున్నామన్నారు.

జిల్లాలో ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలు, ఆరోగ్య మందిర్‌లు, సబ్‌సెంటర్లలోనూ అన్ని సదుపాయాలకు ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు వివరించారు.

జమలాపురం, కేజీ మల్లెల, చిరునోముల, బచ్చోడు, రాంక్యాతండాల్లో సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు మంజూరికి ప్రతిపాదనలు పంపించామన్నారు. వీటితో పాటు మంచుకొండ, మార్తురుపేట, చెన్నూరు, గంగారం, లంకాసాగర్ పీహెచ్‌సీలకు ప్రహరీగోడల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఖమ్మం నగరంలో రూ కోటి 50లక్షలతో వెంకటేశ్వర నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు.

భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖ అధికారిగా వెంకటరమణ



చుంచుపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారిగా వి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్వస్థలం ఖమ్మం జిల్లాకు చెందిన వెంకటర మణ కొత్తగూడెం రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐగా పని చేస్తున్నారు. గతంలో జిల్లా డిటివోగా విధులు నిర్వహించిన జి.సదానందం పదోన్నతిపై హైదారాబాద్ డిప్యూటీ ట్రాస్ పోర్ట్ కమీషనర్‌గా వెళ్ళారు. హైదారాబాద్ కమీషనర్ వారి ఆదేశాలనుసారం నూతన భద్రాద్రి డిటివోగా విధుల్లో చేరిన వెంకటరమణకు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జావిలిన్‌త్రో జూనియర్స్ విభాగంలో బంగారు పతకం

భద్రాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ఎస్కే. అమిన్ జావలిన్‌త్రోలో సీఎం కప్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. అలాగే మడకం శ్రీవిద్య దొర హడిల్స్ బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం సాధించారు.

సబ్ జూనియర్స్ విభాగంలో బి.ప్రద్విక జావిలిన్‌లో బంగారు పతకం సాధించారు. వీరిని జిల్లా క్రీడల అధికారి ఎం.పరందామరెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డా. జి.యేగంధ్రరెడ్డిలు అభినందించారు.

బీజేపీ గ్రామ, గ్రామాన విస్తరించాలి

ఖమ్మంబైపాస్‌రోడ్ జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీని, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని జిల్లాలోని గ్రామా, గ్రామాల విస్తరించేలా ముందుకు వెళ్లాలని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ సౌత్ ఇండియా మాజీ ఛైర్మన్ పేరాల శేఖర్ అన్నారు. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయలేకపోయిందన్నారు. రైతుభరోసా పేరుతో డిసెంబరు ఆఖరిలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని చెప్పి నేటివరకు డబ్బులను జమచేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలని ఆదిశగా కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పొనుగంటి పాపారావు జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారానాయణ, రాష్ట్ర నాయకులు తాండ్ర వినోదరావు, గంటేల విద్యాసాగర్, సన్నె ఉదయ్‌ప్రతాప్, వెంకటగుప్తా, సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వరరావు, దొంగల సత్యనారాయణ, డాక్టర్ శీలం పాపారావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, చావా కిరణ్ పాల్గొన్నారు.

వడివడిగా 'మున్నేరు' పనులు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వచ్చే వానాకాలం నాటికి మున్నేరు వరద నివారణ పనులు పూర్తిచేసి వరద బాధితులకు శాశ్వత పరిష్కారంచూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జూలై 15 నాటికి పనులు పూర్తిచేయాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల నుండి ఖమ్మం, పాలేరు నియోజవర్గాల ప్రజలకు మున్నేరు వరద పెద్దసమస్యగా మారిందని, దీనికి శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వం రిటైనింగ్‌వాల్స్ నిర్మిస్తున్నదని తెలిపారు. మున్నేరు వరద కారణంగా అనేక కాలనీలు,వర్షాకాలంలో వరద సమస్యకు గురవుతున్నాయని, ఈ క్రమంలోనే ముంపు నివారణకు మున్నేరు ఒడ్డున శాశ్వత పరిష్కారం మార్గంగా రూ.690 కోట్లతో 17 కి.మీ. ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నామని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు.

రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి 234 ఎకరాల భూమి అవసరం ఉండగా, 64 ఎకరాల ప్రభుత్వ భూమి, 170 ఎకరాల పట్టా భూమి ఉందని, వెంటనే భూసేకరణ చేపట్టాలని సూచించారు. మున్నేరు వరదతో పాటు నగరం నుంచి వచ్చే వరదను అంచనాలు వేసి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ప్రతినెలా రెండురోజులు ఈ పనులు తనిఖీచేయడం జరుగుతుందని, పనుల్లో ప్రతిరోజు పురోగతి ఉండాలని, వాట్సాప్‌లో సమాచారం అప్‌డేట్ చేయాలన్నారు. గత సెప్టెంబరులో వచ్చిన భారీ వరదను కూడా తట్టుకునేలా రిటైనింగ్‌వాల్ నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

భూసేకరణ ఎంజాయిమెంట్ సర్వే రెండురోజుల్లో పూర్తిచేసి వివరాలు సమర్పించాలన్నారు. మున్నేరు బఫర్‌జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల వివరాలు కూడా నివేదిక ద్వారా అందించాలని కోరారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. రిటైనింగ్ వాల్ డిజైన్‌లో చెక్‌డ్యాం నుంచి వరద ప్రవాహం పరిగణలోకి తీసకున్నారా లేదా అని అధికారులను ప్రశ్నించారు.

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ గతేడాది వచ్చిన భారీవరదల నేపథ్యంలో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళిక తయారుచేశామని, మున్నేరులో 3 లక్షల 50 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియ వేగంగా చేపడతామని తెలిపారు.

సంక్రాంతిలోగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ

సంక్రాంతి పండుగలోపు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. పాలేరు నియోజకవర్గంలోని మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బతండాలో 29, నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెంలో 18 మొత్తం 131 డబుల్ ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీవో నర్సింహరావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, పాలేరు నియోజకవర్గప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు డీఈవో సన్మానం

38మంది ఉపాధ్యాయురాళ్లకు మెమోంటో, సరిఫికెట్లు అందజేత..

కొత్తగూడెం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలేను మీరు ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలని డీఈవో ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. శుక్రవారం జిల్లావిద్యావనరుల కేంద్రంలో మహిళా ఉపాధ్యాయురాలు దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వివక్షతకు గురవుతున్న కాలంలో శ్రమించి ఉన్నత విద్యలో చదివి తొలి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే ఎన్నిక అయిందన్నారు. సమాజంలో ఒక గౌరవప్రదమైన ఉపాధ్యాయవృత్తిలో.. ప్రధానంగా ఉపాధ్యాయురాళ్ల తోటి మహిళా విద్యార్థినులను ఉన్నత శిఖరాలకు ఎదిగేవిధంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ.. 2025లో పదవి విరమణ పొందుతున్న 38 ఉపాధ్యాయురాలను శాలువతో సత్కరించి మెమోంటో, సర్టిఫికెట్లను అందించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎం. సతీష్‌కుమార్, ఏ. నాగరాజు శేఖర్, జే. అన్నామణి, ఎస్‌కే. సైదులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో

శబరిమలైకి రయ్.. రయ్..

కారేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంపెళ్లగూడెం నుంచి శబరిమలైకి ఇద్దరు అయ్యప్పస్వాములు శుక్రవారం మోటర్‌సైకిల్‌పై బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన గురుస్వామి బాణోత్ రమేష్, కన్నెస్వామి గుగులోత్ శ్యామ్ సుమారు 1200 కిలోమీటర్ల దూరంప్రయాణించి మూడు రోజుల్లో శబరిమలైకి వెళ్లనున్నట్లు తెలిపారు. వారి యాత్ర దిగ్విజయంగా సాగాలని కోరుకుటూ స్థానిక మాలధారులు కారేపల్లి మండల కేంద్రం వరకు అయ్యప్ప శరణాలతో తోడుగా వచ్చి పంపించారు.


ద్విచక్ర వాహనంపై శబరిమలై యాత్రకు బయలుదేరిన అయ్యప్పలు

ఉత్సాహంగా కేయూ ఇంటర్ జోన్ క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలు శుక్రవారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమైనాయి. పోటీలకు అతిథ్య ఖమ్మం జిల్లా జట్టుతో పాటు వరంగల్, ఆదిలాబాద్ జిల్లా జట్లు పాల్గొన్నాయి. నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో తొలి రోజు వరంగల్, ఆదిలాబాద్ జిల్లా జట్ల మధ్య లీగ్ పోటీ నిర్వహించారు. మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ నిర్ణీత 30 ఓవర్లలో 104 పరుగులు చేసి ఆలౌట్ కాగా అనంతరం చేజింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 10 ఓవర్లలో 105 పరుగులు చేసి విజయం సాధించింది. పోటీలను ఖమ్మం కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.


వరంగల్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం కూసుమంచి మండలంలో పర్యటించనున్నారు. లోక్యాతండా, కోక్యాతండా, లింగారాంతండా, కూసుమంచి, ధర్మతండా క్రాస్‌రోడ్డులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేడు ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌ను శనివారం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ ఫెస్టివల్‌లో భాగంగా వ్యాసరచన, క్విజ్, ఎస్సే రైటింగ్, వక్తృత్వ పోటీ, పోస్టర్ పెయింటింగ్, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో మేస్త్రీకి గాయాలు

బోనకల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి రైల్వే స్టేషన్ జంక్షన్ వద్ద విద్యుత్ పనులు చేస్తుండగా శుక్రవారం మేస్త్రీకి గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన గజానన్ గణపతి దుకరే గత కొంత కాలంగా ఎలక్ట్రీషియన్ మేస్త్రీగా పనులు చేపిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 వాహనం ద్వారా ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

'దళితబంధు' పేరుతో మోసం

కారేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంపెళగూడెం గ్రామంలో దళితబంధు ఇప్పిస్తానని మోసంచేసిన ముగ్గురువ్యక్తులపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ ఎన్.రాజారాం తెలిపారు. గ్రామనికి చెందిన ఎర్రబెల్లి సుమన్ అనేవ్యక్తికి దళితబంధు ఇప్పిస్తానని అదేగ్రామానికి చెందిన బానోత్ వీరన్న, బానోత్ అశోక్, బానోత్ సీత్యాలు రూ.2లక్షల 40వేలు తీసుకున్నారు. రుణం రాకపోయేసరికి బాధితుడు పోలీసులు ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న 13 సెల్‌ఫోన్ల అందజేత

ముదిగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ముదిగొండలో పలు గ్రామాల్లో పనుల నిమిత్తం వెళ్తుండగా పోగొట్టుకున్న 13సెల్‌ఫోన్లను శుక్రవారం సీఐ మురళీ బాధితులకు అందజేశారు. పలువురు గత కొద్దిరోజుల క్రితం పనుల నిమిత్తం వెళ్తుండగా వివిధ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు పోయాయమని ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీ ఆదేశాల మేరకు ఎస్ఐ నరేష్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు సమాచారాన్ని తీసుకొని ఫోన్లను రికవరీ చేశారు. 13మందికి సంబంధించిన ఫోన్లు రూ.రెండులక్షలు విలువ చేస్తాయని సీఐ మురళీ తెలిపారు. ఈమేరకు బాధితులకు సీఐ మురళీ సెల్‌ఫోన్లను అందజేశారు. బాధ్యతగా విధులు నిర్వహించిన సెల్‌ఫోన్లను రికవరీ చేసిన ఎస్ఐ నరేష్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కోటేశ్వర్‌రావులను సీఐ అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో బైక్ మాయం

మధిరటౌన్, జనవరి3(ఆంధ్రజ్యోతి): మధిర రైల్వే స్టేషన్ రెండో నెంబర్ ప్లాట్‌ఫారంలో బుకింగ్ ఆఫీస్ వద్ద నిలిపి ఉంచిన బైక్‌ను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైల్వేస్టేషన్ లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జిలుగుమాడుకు చెందిన గద్దల వెంకటేశ్వర్లు తన బైక్‌ను నిలిపి ఉంచి పనులు పర్యవేక్షించి వచ్చి చూసే సరికి బైక్ కనిపించకుండా పోయింది. దీంతో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మెడలో గొలుసును లాగి...

మధిర యాదవ బజార్‌కు చెందిన రైల్వే ట్రాక్‌మెన్ వెంకటనారాయణ తన భార్య రమణతో కలిసి మధిరలో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో ట్రైన్ దిగితున్న సమయంలో ఓ అగంతకుడు రమణ మెడలో గొలుసును అపహరించే ప్రయత్నం చేశాడు. గొలుసు లాక్కొంటుండగా ఆమె గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగి సగం అగంతకుడు చేతికి చిక్కగా అతడు దాంతో పారిపోయాడు మిగతా సగం రమణ చేతిలోనే ఉండి పోయింది. దీంతో వారు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శతాధిక వృద్ధుడి మృతి

పెనుబల్లి, జనవరి3(ఆంధ్రజ్యోతి): పెనుబల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు మోటపోతుల వెంకటనారాయణ(104) శుక్రవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు అనుచరుడిగా పనిచేశారు.

బియ్యం దుకాణంలో దొంగతనం

నేలకొండపల్లి, జనవరి3(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని ఓ బియ్యం దుకాణంలో శుక్రవారం సాయంత్రం చోరీ జరిగింది. నేలకొండపల్లి కూసుమంచి రోడ్డులోని ఓబియ్యం దుకాణానికి శుక్రవారం సాయంత్రం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బియ్యం కావాలంటూ వచ్చారు. దుకాణం యజమాని కొత్తా రమేష్ వచ్చిన వ్యక్తికి బియ్యం చూపించటానికి తీసుకుని వెళ్లగా, వెంట వచ్చిన మరో వ్యక్తి అక్కడ ఎవరూ లేని విషయాన్ని గమనించి క్యాష్ కౌంటర్‌లో నుంచి డబ్బును దొంగిలించాడు. క్యాష్ కౌంటర్ నుంచి నగదును దొంగిలించటాన్ని లోపలి నుంచి గమనించిన యజమాని భార్య, గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ కౌంటర్‌లో నుంచి డబ్బు తీయటం ఏమిటో అర్థం గాక కేకలు వేసింది. దీంతో అప్రమత్తమైన దుకాణదారు డబ్బు దొంగిలించిన వ్యక్తిని పట్టుకోవటానికి ప్రయత్నం చేయగా అప్పటికే ఆవ్యక్తులు వచ్చిన ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. విషయాన్ని దుకాణం యజమాని రమేష్ నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సంతోష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిని బురిడీ కొట్టించి..

ఇల్లెందు టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడినిబురిడీ కొట్టించి అతడి వద్ద ఉన్న రూ.1200లు కాజేసిన సంఘటన శుక్రవారం ఇల్లెందులో చోటుచేసుకుంది. ఇల్లెందు పట్టణంలోని వినోభాకాలనికి చెందిన చంద్రయ్య అనే వృద్ధుడు కరెంట్, పంపు బిల్లులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాడు. మున్సిపల్ కార్యాలయంలో పంపు బిల్లు కట్టిన అనంతరం పక్కనే ఉన్న మీసేవ కేంద్రంలోకి వెళ్లి కరెంట్ బిల్లు కట్టేందుకు ప్రయత్నించాడు. అక్కడి వారు కరెంట్ ఆఫీసుకు వెళ్లాలని సూచించారు. బయటకు వెళ్లిన వృద్ధుడిని వెంబడించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి బిల్లు తాను చెల్లిస్తానని, మున్సిపల్ కార్యాలయంలో పని పని చేస్తున్నాని, అతడి వద్ద ఉన్న రూ.1200లు తీసుకుని విద్యుత్ బిల్లుపై సెల్ నెంబర్ రాసి ఇచ్చాడు. మరలా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సదరు వ్యక్తి అక్కడ కనిపించకపోవడంతో వృద్ధుడు లబోదిబోమన్నాడు. ఈ విషయం ఇల్లెందు సీఐ సత్యనారాయణకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు ఎస్ఐ సందీప్ వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

చండ్రుగొండ అంబేద్కర్‌నగర్‌లో చోరీ

చండ్రుగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చండ్రుగొండ అంబేద్కర్ నగర్‌లో తమ్మళ్ల ముత్తమ్మ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. బాధితురాలు సీతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.4.500, రూ. లక్ష విలువైన బంగారు వస్తువులు పోయాయని తెలిపింది.

శుక్రవారం బీరువా తెరిసి చూడగా నగదు, బంగారం కనిపించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమాజం పట్ల బాధ్యతగా మెలగాలి

- జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు
- కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజుల కథ, కవిత కార్యశాల ప్రారంభం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి03(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే సమాజం పట్ల విద్యార్థులు బాధ్యతగా మెలగాలని జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించే కథ, కవితా కార్యశాల కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో ఉండాలంటే కథలు, కవిత్వంపై పట్టు ఉండాలన్నారు. కథలు, కవిత్వం చదవడంతో పాటు, రాయడం నేర్చుకోవాలన్నారు. అనంతరం సాహిత్యం - విద్యార్థులు - సమాజం గురించి తదితర అంశాలను వివరించారు. ఈ కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులను నాలుగు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వాసిరెడ్డి రమేష్‌బాబు

తరగతులుగా విభజించారు. ఒక తరగతికి 50 మంది విద్యార్థులు ఉండేలా ఏర్పాటు చేశారు. హాజరైన విద్యార్థులకు సలహాలు, సూచనలను రచయితలు, కవులతో తెలియజేసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కథ ఎలా రాయాలో.. కవితను ఎలా నిర్మాణం చేయాలో చర్చించారు. తొలి రోజు ఈ తరగతి గదులకు ప్రముఖ కథా రచయితలు హైదరాబాద్ ప్రాంతానికి చెందిన దేవరాజు, దేవయ్య, శ్రీనివాస్‌గౌడ్, కోదాడ ప్రాంతానికి చెందిన పుష్పాల కృష్ణమూర్తి, కవయిత్రులు కరుణతాయమ్మ, తోట సుభాషిని, భగవాతం హాజరయ్యారు.

రచనలలో తీసుకోవలసిన అంశాలు, శైలి, నైపుణ్యాలను గురించి వివరించారు. గంటన్నర పాటు జరిగిన ఈ కార్యశాలలో విద్యార్థులకు రాబోయే రోజుల్లో పునాదిలా, వారి జీవితాల్లో ఉపయోగపడే విధంగా నేర్పించారు. మొదటి రోజు జిల్లాలోని 45 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండో రోజైన శనివారం కార్యాశాలలో విద్యార్థులు ఒక శీర్షికను ఇచ్చి కథలు, కవిత్వం రాయిస్తామని తెలిపారు. ఈ కార్యశాలలో ప్రముఖ కథ రచయిత కిరంశెట్టి కాంతారావు, మండవ సుబ్బారావు, తెలుగు ఉపాధ్యాయులు మధు, సూర్యనారాయణ, కొత్తగూడెం క్లబ్ మేనేజర్ మన్సూర్, సిబ్బంది శ్రీనివాస్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

ఖమ్మంక్రైం, జనవరి3(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పేకాటరాయుళ్లను శుక్రవారం ఖమ్మం టాస్క్‌ఫోర్సు పోలీసులు, ఖానాపురంహవేలి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు. శ్రీకొండాయిగూడెంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించగా ముగ్గురు పట్టుబడ్డారని, మరో నలుగురు పారిపోయారని సీఐ తెలిపారు. పులిగుజ్జ సారయ్య, అంకర్ల వీరబాబు, తోట రమణయ్య పట్టుబడ్డారని, కోడిరెక్కల సీతారాములు, కట్టా నరేష్, శీలం శివ, పిట్టల వేణులు పరారీలో ఉన్నారని, వీరిపై స్టేట్‌గేమింగ్ యాక్టు కింద కేసులు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్దనుంచి రూ.1950లు నగదు, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

2024లో పెరిగిన మద్యం అమ్మకాలు

- ఏడాది చివర్లో తగ్గిన మద్యం సరఫరా

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గడిచిన 2024సంవత్సరంలో మద్యం విక్రయాలు రూ.66కోట్లు పెరిగాయి. 2023కంటే 2024లో అమ్మకాలు పెరిగినప్పటికీ ఏపీలో కూటమి ప్రభుత్వం నూతన మద్యం అమలుచేసిన నాటి నుంచి గత మూడునెలల్లో మరీ ముఖ్యంగా డిసెంబరులో మద్యం అమ్మకాలు తగ్గాయి. గడిచిన డిసెంబరు చివరి రెండు రోజులు మాత్రం మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. 2023 జనవరి ఒకటి నుంచి డిసెంబరు 31వరకు రూ.2,277కోట్ల మద్యాన్ని విక్రయించారు. ఆ ఏడాది ఐఎంఎల్ పెట్టెలు 28.90లక్షలు, బీరు పెట్టెలు 19.45లక్షలు సరఫరా చేశారు. 2024 జనవరి ఒకటి నుంచి డిసెంబరు 31వరకు 2,343కోట్ల మద్యాన్ని విక్రయించారు. మద్యం పెట్టెలు 30లక్షలు, బీరు పెట్టెలు 19లక్షలు సరఫరా చేశారు. 2023కంటే ఐఎంఎల్ పెట్టెలు 2024లో 1.10లక్షలు పెరగ్గా, బీరు పెట్టెల సరఫరా మాత్రం 45వేలు తగ్గాయి. ఇదిలా ఉంటే 2023 డిసెంబరులో రూ.264కోట్ల మద్యాన్ని విక్రయించారు. ఆఒక్క నెలలోనే 3.40లక్షల మద్యం పెట్టెలు, 1.58లక్షల బీరుపెట్టెలు సరఫరా చేశారు. 2024 డిసెంబరులో రూ.228కోట్ల మద్యాన్ని మాత్రమే విక్రయించారు. 2.95లక్షల మద్యం పెట్టెలు, 1.49లక్షల బీరుపెట్టెలు సరఫరా చేశారు. గడిచిన డిసెంబరులో అంతకుముందు కంటే 45వేల మద్యం పెట్టెలు, దాదాపు 9వేల బీరు పెట్టెల సరఫరా తగ్గింది. పాత సంవత్సరం ముగింపు సందర్భంగా మందుబాబుల్లో జోష్ నింపింది. ఏపీలో అన్నిరకాల మద్యం అందుబాటులోకి రావడంతో ఆరాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఉమ్మడి జిల్లాలోని వైన్‌షాపుల్లో మద్యం అమ్మకాలు తగ్గాయి. దాంతో గత డిసెంబరు కంటే ఈ డిసెంబరులో రూ.36కోట్ల మద్యం అమ్మకాలు తగ్గిపోయాయి.



ఎర్రకుంట ఏఎన్ఎంకు ప్రతిభా పురస్కారం



అన్నపురెడ్డిపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని అబ్బుగూడెం ఉపకేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న తేజావత్ సుశీలకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, పూలే ఉత్సవకమిటీ సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏఎన్ఎంకు పురస్కారం అందజేశారు. ఆదివాసీల గ్రామాల్లో సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆమె తెలిపారు.

నాగపురి రోజాకు పూలే రాష్ట్రస్థాయి అవార్డు



ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖానాపురంహవేలికి చెందిన నాగపురి రోజా సావిత్రి బాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీజేపి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అవార్డును అందించారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

కల్లూరు మునిసిపాలిటీకి ఓకే

- గ్రామ సభలో తీర్మానం
- ముక్తకంఠంతో ఆమోదం

కల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీ ఉన్నతిగా అధికారికంగా ఓ అడుగు ముందుకు వేయనున్నది. శుక్రవారం కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మునిసిపాలిటీ ఉన్నతి విషయమై గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సభలో కల్లూరు మేజర్ పంచాయతీపై స్థానికంగా పలు రాజకీయ పార్టీల నుంచి, ప్రముఖుల నుంచి అధికారులు అభిప్రాయ సేకరణ చేశారు. కల్లూరు పంచాయతీ ఉన్నతికి అన్ని విధాలుగా అర్హతలు కలిగి ఉందన్నారు.

కల్లూరు పంచాయతీకి మునిసిపాలిటీ అప్‌గ్రేడ్ విషయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకోరాగా ఆయన కూడా ఈమేరకు హామీ ఇచ్చారు.



కల్లూరు మునిసిపాలిటీగా ఉన్నతికి గ్రామ సభలో ఆమోదం తెలుపుతున్న ప్రజలు

కల్లూరు మునిసిపాలిటీగా అప్ గ్రేడ్ కావడానికి ఈ గ్రామ సభలో అధికారికంగా అడుగులు పడ్డాయి. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో గతంలో ఉన్న హనుమాతండ, కిష్టయ్య బంజర, పడమట లోకవరం, తూర్పు లోకవరం, పుల్లయ్యబంజర, కప్పలబంధంతో పాటుగా తాజాగా వాచ్యానాయక్‌తండ గ్రామాన్ని విలీనం చేస్తూ కల్లూరు మునిసిపాలిటీగా చేసే విషయమై ఈ సభలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ సూచనప్రాయంగా ప్రకటించారు.

ఈ గ్రామ సభలో కల్లూరు మునిసిపాలిటీగా చేసే విషయంలో ప్రజలందిరి అభిప్రాయానికి అనుగుణంగా ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. ఈ సభలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, ఈవో ఎన్ నాగేశ్వరరావు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రైతు నెత్తిన తరుగు పిడుగు

- తరుగు పేరుతో అన్నదాతకు కుచ్చుటోపి
- క్వింటాకు 1224రకానికి 8కిలోల కోత
- 1264 రకం అయితే ఇంకా అధికం..
- అలా అయితేనే కొంటామంటున్న మిల్లరు
- కామేపల్లి మండలంలో కొనుగోలులో అక్రమాలు



కామేపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తరుగు పేరుతో రైతులకు మిల్లర్లు కుచ్చుటోపి పెడుతున్నారు. తరుగు తీస్తేనే కొనుగోలు చేస్తామంటున్న మిల్లర్లతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారు అయింది. నెలలు గడుస్తున్న కల్లాల్లోనే ధాన్యం పేరుకుపోయింది. అటు ప్రైవేటుకు అమ్ముకోక. ఇటు ప్రభుత్వం కొనుగోలు చేయక రైతులు అరిగోస పడుతున్నారు. మిల్లర్ల తరుగు డిమాండ్ వెనుక అధికారుల పాత్ర ఉందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

కామేపల్లి మండల వ్యాప్తంగా రెండు సొసైటీలు ఉన్నాయి. పీఏసీఎస్ సొసైటీ ద్వారా ఐదు కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ద్వారా నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పింజరమడుగు గ్రామంలో ఐకేపీ ద్వారా రైతుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే తొలుత ఓ లారీలో 1224రకం ధాన్యం 630టిక్కీలను మిల్లరు దగ్గరకు తరలించారు. అయితే ధాన్యం దిగుమతి చేసుకోకుండా పెండింగ్ పెట్టారు. తొలుత 5కేజీలు కట్ చేస్తామని చెప్పి 8కేజీల వరకు తరుగు పేరుతో కట్ చేశారని రైతులు వాపోయారు.

ధాన్యం ముక్క అవుతున్నాయనే పేరుతో గ్రామంలో ఉన్న ధాన్యం మొత్తాన్ని అధికంగా తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యంగా ఉన్న ధాన్యం నుంచి తరుగు పేరుతో మిల్లర్లు దోచుకుంటున్నారని వాపోతున్నారు. 1264రకం ధాన్యమైతే అసలు కొనుగోలు చేయామని చెబుతున్నారని అన్నారు. ఒకవేళ కొనాలంటే 1224 రకం కంటే ఎక్కువ తరుగు ఇవ్వాలని తెల్చి చెప్పడంతో రైతులు అయోమయంలో పడ్డారు. మిల్లర్లకు అధికారులు ఎమైనా సహకరిస్తున్నారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే టిక్కీలకు తరుగు తీసి ఆన్‌లైన్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మిగత గ్రామాల్లో రెండు నుంచి మూడు కేజీల వరకు మాత్రమే తరుగు తీస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి తారాదేవి వివరణ అడగగా బస్తా బరువును మాత్రమే తరుగుగా తీస్తారని అన్నారు. తరుగు పేరిట వేదిస్తే చర్యలు తప్పవని అన్నారు.

రైతులను దోచుకుంటున్నారు...

తరుగుపేరుతో రైతులను దోచుకుంటున్నారని పింజరమడుగు రైతులు ముత్తయ్య, అచ్చయ్య వాపోయారు. ముత్తయ్య కౌలు రైతు కాగా 1224 రకం ధాన్యం బస్తాలు 237 టిక్కీలు అయ్యాయి. కానీ 15టిక్కీలు మా ముందే తరుగు పేరుతో కట్ చేసి ఆన్‌లైన్ చేశారు. ప్రభుత్వం ధాన్యం ఎలా ఉన్నా కొంటామని చెప్పి తరుగు పేరుతో మిల్లరు దోచేస్తున్నారు. అచ్చయ్యకు సంబంధించిన 193 టిక్కీలను కాంటా వేశారు కానీ 13 టిక్కీలను తరుగు పేరుతో తీసివేశారు. ఆదేంటి అని అడిగితే వడ్లు ముక్క అవుతున్నాయని చెప్పి బయటపెట్టారు. చేసేది ఏమిలేక అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


విద్యార్థులతో కూర్చొని విజయకేతనం చూపిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విద్యార్థులు ఆంగ్లంలో రాణించాలి

- భయం వీడితే విజయం మీవెంటే.. ▸ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, జనవరి3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆంగ్లభాషలోనూ రాణించాలని, దాని ద్వారా ప్రపంచంలో లభించే అన్ని అవకాశాలను సులువుగా అందుకోవచ్చని, ప్రతి విద్యార్థి ఒకరునొకరు ఆంగ్లంలో సంభాషణ చేసుకోవడం ద్వారా సులువుగా నేర్చుకోవచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్‌సీఈఆర్‌టీ జిల్లా విద్యాశాఖల ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల మధ్య తరగతి గదిలో కూర్చొని వారి నుంచి ఆంగ్లంలో వక్తృత్వ నైపుణ్యాలను స్వయంగా విని పరిశీలించారు. విద్యార్థులతో ఆంగ్లంలో సంభాషణను దగ్గర ఉండి చేపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లం అంటే భయం వద్దని, అందరు ఒకరినొకరు ఆంగ్లంలో మాట్లాడుకోవడం ద్వారా సులువుగా ఆంగ్లం వస్తుందన్నారు. అనంతరం ఒలంపియాడ్, ఎలక్యూషన్(డిబెట్) పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖర్‌శర్మ, తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్, ఎంఈవో అబ్రహం, ఈఎల్‌టీఏ అధ్యక్షుడు జగదీష్, కో ఆర్డినేటర్ సంక్రాంతి రవికుమార్, భాస్కర్, శ్రీదేవి, రమేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దమ్మపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తలిస్తుండగా పోలీసులు పట్టుకున్న ఘటన వడ్లగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ షకీల్ కుటుంబ సభ్యులు గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి వాటిని ఏపీలోని గంటూరుకు వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



వైద్యకళాశాలలో ప్రత్యేక జిమ్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి3(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ వైద్య కళాశాలో ప్రత్యేక జిమ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. విద్యార్థిని, విద్యార్థుల కోసం విడివిడిగా ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కల్పించేందుకు మెదటి, రెండో ఏడాది విద్యార్థులతో 13కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. వారిలో నాయకత్వ లక్షణాలు అలవర్చేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా రూ.4లక్షలతో హాస్టల్‌లోనే ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆటల కోసం షటిల్ కోర్టులు,వ్యాయామ కోర్టులను ఏర్పాటు చేశామన్నారు. మ్యూజికల్ కిట్లను కొనుగోలు చేసి ఉల్లాసాన్ని కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	40
బీరకాయ	50
పచ్చిమిర్చి	38
కాకరకాయ	48
బెండకాయ	44
పొట్లకాయ	50
దోసకాయ	34-44
చిక్కుడు	50
నాటుచిక్కుడు	70
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	24
దొండ	58-60
సొరకాయ	30
క్యారెట్	44
క్యాప్సికం	60
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్


నివాళులర్పించి ప్రసంగిస్తున్న గుండాల కృష్ణ


న్యూవిజన్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హార్వెస్ట్ పాఠశాలలో..

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. సోమశేఖర్‌శర్మ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళా సాధికారతకు బాలిక విద్యకు చేసిన కృషిని వివరించారు. వీరనారీమణుల ఆశయ సాధనసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎస్‌బీఐటీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ హాజరయ్యారు. మహిళలు బయటకు రాని ఆనాటి పరిస్థితుల్లో స్త్రీవిద్యకోసం జీవితాన్ని అంకితం చేసిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఆధ్వర్యంలో నగరంలోని పూలే చౌక్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. బహుజన సమాజ్‌పార్టీ , ఏఐఎస్ఎఫ్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. - నెట్‌వర్క్


తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ..


ఎస్‌బీఐటీలో..


నేలకొండపల్లిలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో...


నేలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు



పీఆర్టీయూ ఆధ్వర్యంలో..


పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీఈవో

సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- పిల్లలకు వాహనాలివ్వడం వల్లే ఎక్కువ ప్రమాదాలు
- నిర్లక్ష్యంగా నడపటం ప్రాణాలకే ప్రమాదం
- జాతీయ రహదారుల సంస్థ పీడీ దివ్య

నేలకొండపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత... మనందరి బాధ్యత అని జాతీయ రహదారుల సంస్థ పీడీ దివ్య అన్నారు. పైనంపల్లి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా ఉత్సవాల్లో పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భద్రతా ఉత్సవాల జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్డు పనులన్నీ పూర్తి అయ్యాయన్నారు. ఇది 36వ రోడ్డు భద్రతా ఉత్సవాలన్నారు. రోడ్డు భద్రతను పాటించకపోవటం, నిర్లక్ష్యంగా వాహనాలను నడపటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మన దేశంలోనే రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. త్వరగా ఇళ్లకు వెళ్లాలన్న ఆలోచనతో ట్రాఫిక్ సిగ్నల్స్ క్రాస్ చేయటం, వాహనాలను ఓవర్‌టేక్ చేయటం, అధిక వేగంతో వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పరిమిత వేగంతో ప్రయాణిస్తే చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కొద్ది సమయం ఓపికగా వెళితే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చన్నారు. ఇటీవలి కాలంలో 18ఏళ్ల లోపు పిల్లలు ఎక్కువగా వాహనాలను నడుపుతున్నారని, దీంతో ప్రమాదాల సంఖ్య బాగా పెరిగిందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలివ్వవద్దని ఆమె కోరారు. ఈ విషయమై కాలేజీలు, స్కూల్స్‌లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన ఉందని ఆమె చెప్పారు. రోడ్లన్నీ పూర్తి అయ్యాయా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ఖమ్మం-కోదాడ పూర్తి అయ్యింది. ఖమ్మం-దేవరపల్లి ఫినిషింగ్ స్టేజ్‌లో ఉంది. నాలుగునెలల్లో పూర్తి అవుతుంది. నాగపూర్-అమరావతి, ఖమ్మం నుంచి విజయవాడకు, మంచిర్యాల నుంచి వరంగల్, వరంగల్ నుంచి ఖమ్మం రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయి. రెండేళ్లలో పూర్తి అవుతాయన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కిరణ్, అదానీ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, టోల్ మేనేజర్ మోహన్‌సాయి, మైనేని, నిమ్మగడ్డ కిరణ్‌సాయి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ పాల్గొన్నారు.


భద్రతా ఉత్సవాల జెండాను ఆవిష్కరిస్తున్న పీడీ దివ్య

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ఖమ్మంరూరల్,జనవరి3(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యం.వి పాలెంలో రూ.66లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి,ఎం.వి.పాలెంనుంచి గోళ్లపాడు వరకు రూ.2కోట్ల60 లక్షలతో చేపట్టనున్న బీటీ నిర్మాణపనులకు, కాచిరాజుగూడెం గ్రామంలో రూ.18 లక్షలతో చేపట్టిన అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, చింతపల్లి, ఆరెకోడు తండ నుంచి తిరుమలాయపాలెం బిటి.రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పాలేరు నియోజక వర్గానికి ఇళ్లు అధికంగా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతు గత వరదల సమయంలో వచ్చిన ఆపద మరోసారి రాకుండా 17 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, ప్రత్యేకాధికారి రమేష్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ హేమలత, ఏడీఏ సరిత,మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రేషన్ డీలర్లు

ఖమ్మంకలెక్టరేట్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రేషన్ డీలర్స్ సంఘం జిల్లా నేతలు శుక్రవారం కలిశారు. డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానిమియా,వెంకట్‌నారాయణ, ఇబ్రహీం తదితరులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జయహో జానపదం

ఖమ్మంసాంస్కృతికం, జనవరి3: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం జయహో జానపదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవదూతేంద్రమణికంఠ భజన బృందం నిర్వాహకులు ఒకప్రకటనలో తెలిపారు. జీనియస్ బుక్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం మధ్యాహ్నం 2 గంటలనుంచి రాత్రి 8 గంటల వరకు సుదీర్ఘంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

19న 'సంకల్పం' నాటిక

ఖమ్మంసాంస్కృతికం, జనవరి3: నెల నెల వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 19న సాయత్రం 6 గంటలకు సంకల్పం నాటిక ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు ఎఎస్ కుమార్ ఒక ప్రకటనలోతెలిపారు. జాస్మిన్‌ఆర్ట్‌అండ్ కల్చరల్ ఈవెంట్స్ విశాఖపట్నం కళాకారుల ఆధ్వర్యంలో రచన రావి నాగేశ్వరరావు, దర్శకత్వం సంధ్యాప్రియదర్శిని అని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్



ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి3 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

- మెనూ ప్రకారం విద్యార్థులకు కామన్ డైట్ అందించాలి
- అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,జనవరి3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు.శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ పనులు, నరేగ, పీఎంశ్రీ, హాస్టళ్లలో సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పీఎం శ్రీ పథకం క్రింద ఎంపికైన పాఠశాలల్లో నిర్దేశించిన అభివృద్ధి పనులను పక్కాగా నిర్వహించాలన్నారు. అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, స్థితిగతులు, బిల్లుల చెల్లింపుపై అదనపు కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. పిల్లలకు అవసరమైన స్టడీమెటీరియల్, ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత ఎంసెట్, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందించేందుకు 150 మంది విద్యార్థులు, ప్రతీ సబ్జెక్టుకు నలుగురు జూనియర్ లెక్చరర్ల చొప్పున ఎంపిక చేసి వివరాలు అందించాలని ఆమె సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సరుకులు సరఫరా చేయని పక్షంలో కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షారైనా, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్లో బయాలజీ టాలెంట్ టెస్ట్

ఖమ్మంఖానాపురంహవేలి జనవరి3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌ను ఆన్‌లైన్‌లో శుక్రవారం నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులు సీహెచ్. భావ్య, పి.వెన్నెల, ఎం.జాహవా, కె.వెంకట శివ తేజ ఈటాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. సైన్స్ అధికారి జగదీశ్,పెసర ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించినారు. ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహణలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి డాన్ బోస్కో, బాధ్యులు, . రంజిత్ కుమార్, ప్రవీణ్ కుమార్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

8న ఇసుక వేలం పాట

రఘునాథపాలెం,జనవరి3(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెంలో ఈనెల 8న రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో 57.5 మెట్రిక్ టన్నుల ఇసుకను వేలం వేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు తహసీల్దారు లూథర్‌విల్సన్ శుక్రవారం ప్రకటించారు. వేలంలో పాల్గొనే వారు బుధవారం ఉదయం 11గంటలకు తహసీల్దారు కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

సేవాలాల్ దేవాలయం నిర్మాణం చేపట్టాలి

రఘునాథపాలెం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండల కేంద్రంలో సంత్‌సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి సహకరించాలని మండల లంబాడీల సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు మాలోత్ రామునాయక్, భూక్యా రాంబాబు, బాదావత్ సంధ్యా, అంగోదు భూక్య, బోడా ఉపేందర్, ధరావత్ రామమూర్తినాయక్ తహసీల్దార్ లూథర్ విల్సన్‌కు వినతిపత్రం అందించారు.

క్రీడలతో స్నేహభావం: ఎస్ఐ

తిరుమలాయపాలెం, జనవరి3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం కలుగుతుందని తిరుమలాయపాలెంఎస్ఐ కూసుఉడి జగదీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బచ్చోడులో మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. యువతలో ఐకమత్యాన్ని పెంపొదిస్తాయన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, తిమ్మిడి హనుమంతరావు, మల్లయ్య, అరవిందరెడ్డి, క్రీడా నిర్వాహకులు రవీందర్, వీరబాబు,రంజిత్, వంశీ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు మార్చాలని వినతి

తిరుమలాయపాలెం, జనవరి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడు సెంటర్‌లో ఉన్న 11కేవీ ట్రాన్సుఫార్మర్, ఎస్సీ కాలనీలో 11కేవీ విద్యుత్‌లైన్లు మార్చాలని కోరుతూ శుక్రవారం కూసుమంచి ఏడీ కోక్యానాయక్‌కు వినతిపత్రం అందించారు.గ్రామంలో ఎస్సీకాలనీలో గతంలో మరమ్మతులు చేసి ఆగిపోయిన 11కేవీ లైన్‌మార్చాలని, గ్రామంలో విద్యుత్‌స్తంభాలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆమంచి దయాకర్, జక్కుల యాదగిరి, తిమ్మిడి హనుమంతరవు పాల్గొన్నారు.

చేగొమ్మ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కూసుమంచి,జనవరి3(ఆంధ్రజ్యోతి):ఇంగ్లిష్ ఒలింపియాడ్, వక్తృత్వ పోటీల్లో చేగొమ్మ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కూసుమంచి పాఠశాలలో ఒలింపియాడ్ ఇంగ్లీష్ భాషానైపుణ్య రాత పరీక్షల్లో కె.స్నేహ ప్రథమస్థానం, గోపి ద్వితియస్థానంలో నిలిచారు.వక్తృత్వపోటీల్లో అక్షర ప్రతిభ కనబర్చింది. ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.అమృను, ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఎంఈవో వీరాస్వామి అభినందించారు.

టీఎన్జీవోస్ నేతలను కలిసిన జిల్లా నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి3(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్,ముజీబ్‌లను ఖమ్మం జిల్లా టీఎన్జీవో నాయకులు శుక్రవారం కలిశారు. జిల్లా నేతలతో పాటు యూనిట్స్, ఫోరమ్‌ల నాయకులు సెంట్రల్ కమిటీ నేతలను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ నాయకత్వం పనిచేసి సమస్యల పరిష్కారంలో జిల్లా నాయకత్వం కృషి చేయాలని సూచించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవో యూనియన్ ప్రభుత్వంతో సామరస్యంగా మెలుగుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గుంటుపల్లి శ్రీనివాస్, కొనిదన శ్రీనివాస్, కొమరగిరి దుర్గాప్రసాద్, గంగవరపు బాలకృష్ణ ,జెడ్.ఎస్. జైపాల్ విజయ్ కుమార్, వల్లపు వెంకన్న, తాళ్లూరి శ్రీకాంత్, ఎస్. లలిత కుమారి,ఏలూరి హరికృష్ణ,పెద్దినేని రాధాకృష్ణ తదితరులున్నారు.

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జనార్ధన్



ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి3 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కాటేపల్లి జనార్ధన్‌ను నియమించారు. శుక్రవారం బల్లేపల్లిలోని ఓ రెస్టారెంటో జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు నారగోని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు నియమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్రఉపాధ్యక్షుడు పెద్దిరాజు, కార్యదర్శులు కోట వెంకటరెడ్డి,అన్నం వీర ప్రసాద్, బుర్ర సురేష్ బాబు,ఎస్కేఅన్వర్ పాషా, కేకైలాష్, పఠాన్‌జానీ, జల్లి శ్యాము, పామర్తి నాగేశ్వరరావు, మదర్, ప్రసాద్ రెడ్డి, కన్నారావు, దేవుళ్ళ వెంకట్, పాశం నరేష్,నున్న కృష్ణప్రియ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం

ఉపాధ్యాయుడు బాబూరావు

నేలకొండపల్లి, జనవరి3(ఆంధ్రజ్యోతి): మాతృభాషలో ప్రావీణ్యంతో పాటుగా విద్యార్థులు ఆంగ్ల భాషపై కూడా పట్టు సాధించాలని ఆంగ్లభాషా ఉపాధ్యాయ సంఘం నాయకుడు, భైరవునిపల్లి ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు తాళ్ళూరి బాబూరావు అన్నారు. విద్యార్థులకు శుక్రవారం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీ నిర్వహించారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్‌తో పాటుగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కన్నెగంటి వెంకటయ్య, తాళ్ళూరి బాబూరావు, కల్పవల్లి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంగ్ల భాషా ఉపాధ్యా సంఘం మండల కన్వీనర్ వెంకన్న, జయరాజు, లక్ష్మీనర్సింహారావు పాల్గొన్నారు.


పరీక్ష నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పంపు ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడిగా నరేష్

తల్లాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల గ్రామపంచాయతీల పంపు ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడిగా బాణోతు నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సమావేశంలో యూనియన్ ఏర్పాటైంది. కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు ప్రధాన కార్యదర్శిగా అమర్లపూడి భవాని, ఉపాధ్యక్షుడిగా తేళ్లపుట్ట వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మాగంటి లాజర్, గౌరవ సలహాదారుగా కిన్నెర చిట్టియ్య ఎన్నికయ్యారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో చంద్రమౌళికి అందజేశారు.

బైండోవర్ కేసు

పెనుబల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో కోడిపందాలు, పేకాట నిర్వహిస్తున్న పలువురిపై బైండోవర్ కేసు నమోదు చేసి శుక్రవారం తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. మండలంలోని కేఎం.బంజర్‌కు చెందిన మల్లాది నర్సింహారావు, మండాలపాడుకు చెందిన పాతునూరి రవిచంద్ర, లింగగూడేనికి చెందిన ఆళ్లకుంట రమేష్‌లను బైండోవర్ చేసి తహసీల్దార్ ప్రతాప్ కోర్టులో హాజరుపరిచారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చింతకాని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ రైల్వే గేటు సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి రైలు కిందపడి మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

కారేపల్లి జనవరి3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగలితండాలో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వారి నుంచి 4సెల్‌ఫోన్లు, 4 మోటర్‌సైకిళ్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

కోడిపందేల స్థావరంపై

సత్తుపల్లి, జనవరి 3: మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామసమీపంలో పామాయిల్ తోటలో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. గంగారం గ్రామానికి చెందిన మారేష్, నారాయణ, వెంకట నారాయణ, తుంబూరుకు చెందిన భరత్, పామాయిల్ తోట యజమాని వెంకట్రామిరెడ్డి, మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కిరణ్ తెలిపారు.

అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

మహిళలు చదువుకున్నప్పుడే సమాజం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని వక్తలు అన్నారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల్లోని పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దేశ మొదటి పంతులమ్మగా పిలవబడే సావిత్రిబాయిపూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించటం హర్షణీయమన్నారు. బాలికలకు విద్యా అవసరాన్ని తెలియ చేసి విద్య వైపు వారు ఆకర్షితులయ్యేలా కృషి చేశారన్నారు.



సత్తుపల్లి మండలం కిష్టారం పాఠశాలలో..



వైరా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఏన్కూరు మండలం బురదరాఘవపురంలో..



బోనకల్‌లో ప్రిన్సిపాల్‌కు సన్మానం



మధిరలో ఉపాధ్యాయురాలికి సన్మానం



పెనుబల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కొణిజర్లలో ఐద్వా ఆధ్వర్యంలో..



తల్లాడ మండలం అన్నారుగూడెంలో..



కల్లూరులో..



ముదిగొండలో నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

యోగాలో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని గంగోత్రి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బంగారు, వెండి పతకాలను దక్కించుకున్నారు. బి.మహేశ్వరి, ఎం.మీనాక్షి బంగారు పతకాలు, సీహెచ్.కౌశిక్, కె.జస్వంత్, ఎం.ఆరాధ్య, కె.జేషు శైలాష వెండి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు, యోగా గురువు రజిని అభినందించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ భూమేశ్వరరావు

పేదలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు



సీనియర్ నాయకుడు లక్ష్మయ్య దంపతులను సన్మానిస్తున్న హేమంతరావు

కొణిజర్ల/వైరా జనవరి3 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాల ద్వారా పేదలకు అండగా నిలచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శుక్రవారం సీపీఐ శత ఉత్సవాల సందర్భంగా కొణిజర్లలో సీనియర్ నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ చరిత్రను నేటి తరాలకు చూపిస్తూ పేద ప్రజల సమస్యల కో సం పోరాడుతుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్రాబాబు, దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, వెంకయ్య, పులయ్య, సోమయ్య, మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, భద్రయ్య పాల్గొన్నారు.

యామాలకు పరామర్శ

వైరా (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావును ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పరామర్శించారు. మండలంలోని గొల్లపూడికి చెందిన గోపాలరావు శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే పూసలపాడులో తుమ్మల సుందర్‌రామయ్య దంపతులను పరామర్శించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు, నాయకులు గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, మోటకొండా పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఘనంగా దయానంద్ జన్మదిన వేడుకలు



వీఎం బంజరలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెనుబల్లి/కల్లూరు/వేంసూరు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం వీఎంబంజర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రె స్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సీనియ ర్ నాయకులు సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, నీలాద్రీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, కల్లూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి, బొర్రా కోటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, పోతురాజు కిషోర్, యడవల్లి సుబ్బారావు, కర్రీ కమలాకర్‌రావు, దూదిపాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

కల్లూరు (ఆంధ్రజ్యోతి): కల్లూరులో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి పారంభించారు. పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

వేంసూరు (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఆపార్టీ ఆధ్వర్యంలో మర్లపాడులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్‌ను నాయకులు కట్ చేశారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైరాలో శుక్రవారం పీఆర్టీయూ క్యాలెండర్, స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో సరస్వతీ ఆవిష్కరించారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియే ట్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, నాయకులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎస్.జాన్, నాగబత్తిని స్వప్న, గృహలక్ష్మీ, స్వర్ణలత, సావిత్రి, మాధురిలత, కారుమంచి దయాకర్, పాటి రామచంద్రయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో సరస్వతి

సీనియర్ నాయకుడికి సీపీఐ నేతల సన్మానం

చింతకాని, జనవరి3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఏర్పడి 100వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సంధర్బంగా మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు 50 సంవత్సరాలు నుంచి పార్టీ సభ్యత్వం కలిగిన వేపూరి సీతయ్య దంపతులను సీపీఐ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు శుక్రవారం సన్మానించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ చాట్ల ఏసు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, పదిమల వెంకటనర్సయ్య, చాట్ల రమేష్, వేపూరి నర్సయ్య తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పర్పుల్ డీఎస్ఏ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గొల్లెనపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరు శ్రీనివాసరావు చేస్తున్న సేవ కార్యక్రమాల గురించి నిర్వాహకులు వివరించారు. పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పి.ఉపేందర్, బండారు సరిత, ఉటూకూరు శైలజా, తిరుమలయ్య, రామకృష్ణ, సంబాచారి, చంద్రశేఖర్, నరేష్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో వైరా విద్యార్థుల ప్రతిభ

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. సిరిపురం హైస్కూల్ విద్యార్థి కె.ఆదిత్య ప్రథమస్థానం, వైరా ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి డి.చరణ్‌సింగ్ షేక్.ఉమర్‌ఫారూక్ ద్వితీ, తృతీయ స్థానాలను సాధించారు. అలాగే ఎలక్యూషియన్ పోటీల్లో రెబ్బవరం విద్యార్థిని టి.తరణి ప్రథమస్థానం, వైరా బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వేదవర్షిత ద్వితీయ స్థానం, గరికపాడు విద్యార్థిని నిహారిక తృతీయ స్థానాన్ని సాధించారు. విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. మొదటి, రెండు స్థానాలు సాధించిన విజేతలు ఈనెల 18న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ఆంగ్ల ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, లలిత, ముజీబ్, శ్రీనివాసరావు, కొండల్‌రావు, సీతరామారావు, భద్రు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలతో ప్రతిభచాటిన విద్యార్థులు

మెరుగైన ప్యాకేజీ ఇప్పించండి

కలెక్టర్‌ను కలిసిన అమరావతి హైవే భూ నిర్వాసిత రైతులు

చింతకాని, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించాలని, సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పెంట్యాల అప్పారావు, వేముల సతీష్, పెంట్యాల వెంకటేశ్వర్లు, చిట్టిమోదు లింగా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నిర్వాసిత రైతులు

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

మధిర రూరల్/మధిరటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాణోతు కళావతిబాయి కోరారు. శుక్రవారం మధిర మండలం మహదేవపురం గ్రామంలోగల పీహెచ్‌సీ సబ్‌సెంటర్(పల్లెదవాఖానా)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. అక్కడకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సంపూర్ణ ఆరోగ్యసేవలు అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని బీసీ కాలనీలో హెల్త్ అసిస్టెంట్ లంకా కొండయ్య బృందం టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తుండగా అక్కడకు వెళ్లి ప్రధానమంత్రి టీబీ ముస్కాభారత్ అభియాన్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. మహదేవపురం గ్రామంలో పల్లె దవాఖానా కోసం స్థలం ఇచ్చిన పుతుంబాక రామసీతమ్మ, పురుషోత్తం కుటుంబసభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, పీహెచ్‌సీ వైద్యులు పృథ్వీరాజ్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి ఎం.దుర్గా, సిబ్బంది విజయకుమారి, సత్యవాణి పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మధిరటౌన్ (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి హాస్టల్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మధిర హరిజనవాడలో ఉన్న ఎస్‌టీ బాలికల హాస్టల్‌ను ఆమె పరిశీలించి విద్యార్థులను స్వయంగా పరీక్షించి, రక్త పరీక్షలు చేయించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో రోజు తప్పకుండా ఆకు కూరలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్బలక్ష్మీ, వైద్య సిబ్బంది గోవింద్, విజయకుమారి, విజయలక్ష్మీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తోపుడుబండ్లు, ట్రైసైకిళ్ల అందజేత

దయానంద్ జన్మదినం సందర్భంగా ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పంపిణీ

సత్తుపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణం-కిరాణ మర్చంట్, సత్తుపల్లి మండల-పట్టణ ఆర్యవైశ్యసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం 20 మందికి పుట్‌పాత్, చిన్నవ్యాపారుస్తులకు చార్జింగ్‌లైట్లు, 5గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, 5గురికి తోపుడు బండ్లు, 12 మందికి గొడుగులు, ఇద్దరికి బీరువాలు పంపిణీ చేశారు. వీటిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పుట్టిన రోజు సందర్బంగా సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి చేతులమీదుగ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాగమయి, మట్టా దయానంద్ మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్బంగా ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆర్యవైశ్యసంఘం, కిరాణ మర్చంట్‌వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు శ్రీధర్, పలువురు ఆర్యవైశ్యసంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. టీజీఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు దయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి దంపతులు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

● ఎంవీఐ రాజశేఖర్

పెనుబల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారిద్దామని ముత్తగూడెం చెక్‌పోస్టు ఎంవీఐ రాజశేఖర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర సరిహద్దులోని ముత్తగూడెం ఆర్టీఐ చెక్‌పోస్టు వద్ద డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రా ఫిక్ నిబంధనలను పాటించి క్షేమంగా ఇంటికి చేరాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించొద్దని హెచ్చరించారు. చెక్‌పోస్టు సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

వైరా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్‌క్లబ్ ఆధ్వర్యంలో నాల్గోవార్డు మాటూరుపేటలో 20మంది వృద్ధులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ బాలయ్య ఆర్థిక సహకారంతో ఈ క్లబ్ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు దుప్పట్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, చిన్నా పాల్గొన్నారు.